

మేఘ సందేశం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆధ్యాత్మికవేత్త నరసింహప్ప, డాక్టర్ నాళేశ్వరం శంకరం, డాక్టర్ రాధాకుసుమ, తదితరులు

ప్రజలను చైతన్యవంతం చేసే రచనలు చేయాలి

● ఆధ్యాత్మికవేత్త నరసింహప్ప

రాంనగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కవులు, రచయితలు ఆధ్యాత్మిక రచనలతో సమాజాన్ని చైతన్యవంతం చేయాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ఆదాయపు పన్ను శాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ ఎం. నరసింహప్ప అన్నారు. సోమవారం చిక్కడపల్లిలోని కళాభారతిలో భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన ప్రముఖ రచయిత్రి భువనేశ్వరి మారేపల్లి రాసిన మేఘ సందేశం పుస్తకావిష్కరణ చేసి ఆయన మాట్లాడారు. ఆధ్యాత్మికత నేపథ్యంలో మేఘసందేశం పుస్తకాన్ని సమీక్షించి సైన్స్ ఆధ్యాత్మికత ఒకటేనని పలు అంశాలపై సోదాహరణంగా వివరించారన్నారు. రచయిత్రి భువనేశ్వరి ఆధ్యాత్మిక రచనల్లో మేఘసందేశం అద్భుతమైన గ్రంథమన్నారు. కార్యక్రమంలో కవులు డాక్టర్ జెల్లి విద్యాధర్, శ్రీనాథ, డాక్టర్ కావూరి శ్రీనివాస్, యాంకర్ జి. నవీనరాణి తదితరులు పాల్గొన్నారు.



నర్సింహబస్తీలో చెత్తపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ అమృత

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● కార్పొరేటర్ అమృత

నల్లకుంట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు తమ ఇంటితో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నల్లకుంట డివిజన్ కార్పొరేటర్ యాకర అమృత అన్నారు. రహదారులు, ఖాదలి ప్రాంతాల్లో చెత్త వేయడం తగదని ఆమె కోరారు. ఒకవేళ రోడ్ల పక్కన చెత్త వేస్తే జరిమానా విధించాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. సోమవారం డివిజన్‌లోని నర్సింహబస్తీ సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద చెత్తవేయకుండా ఉండేందుకు ప్రజల్లో అవగాహన కల్పించారు. ఇంటికి వచ్చే ఆటోరిక్షాలలోనే చెత్త వేయాలని, ఇతర ప్రాంతాలలో వేయవద్దని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే రోగాలు దరికి చేరవని ఆమె సూచించారు. డివిజన్‌లోని బాయమ్మగల్లీ శ్రీబీరప్ప స్వామి దేవాలయం సమీపంలో రూ. 5 లక్షల వ్యయంతో చేపడుతున్న ప్యాచ్‌వర్క్ పనులను ఆమె పరిశీలించారు. పనులను నాణ్యత ప్రమాణాలతో పనులు చేయాలని ఆమె సిబ్బందికి సూచించారు.



కరాటేలో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసిన కార్పొరేటర్ అమృత

విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలి

● కార్పొరేటర్ అమృత

ముషీరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటు క్రీడలపై దృష్టి సారించాలని నల్లకుంట కార్పొరేటర్ అమృత అన్నారు. కరాటే, తైక్వాండోలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆదివారం పద్మాకాలనీలో సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు ఆత్మరక్షణకు దోహదపడుతాయన్నారు. క్రీడల్లో రాణించేవారికి కేంద్ర ప్రభుత్వం విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్లు సైతం కల్పిస్తున్నదని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి క్రీడలపై దృష్టి సారించి తమకు నచ్చిన క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో పద్మాకాలనీ కార్యదర్శి రూపేందర్, ఉపాధ్యక్షులు గౌరీశంకర్, ఉమా తైక్వాండో అకాడమీ ఫౌండర్, సీనియర్ కోచ్ ప్రసన్న ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు


భోలక్‌పూర్‌లో ఉచిత వైద్య శిబిరం

ముషీరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ బడీ మసీదు వద్ద సోమవారం బైబిల్ హౌస్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో వంద మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

రాంనగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బకాయి ఉన్న 20 లక్షల మంది విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం దోమలగూడలోని టీడీపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్సులు పూర్తయిన వారి సర్టిఫికెట్లను కాలేజీ యాజమాన్యాలు ఇవ్వడం లేదని తద్వారా చాలా మంది విద్యార్థులు ఇబ్బందులు పాలవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు ప్రకాష్, కిరణ్, యాదగిరిరావు పాల్గొన్నారు.

సేవాలాల్ సేన రాష్ట్ర కన్వీనర్‌గా మాలోత్ సైదానాయక్



సైదానాయక్

రాంనగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): త్రిసభ్య కమిటీలో కొద్దిమంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం సంఘాన్ని ఉపయోగించుకున్నందుకు పాత కమిటీ రద్దు చేశామని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవనాయక్ తెలిపారు. సోమవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సేవాలాల్ సేన రాష్ట్ర కన్వీనర్‌గా మాలోత్ సైదానాయక్, వ్యవస్థాపక ధర్మ జాగరణ జాతీయ అధ్యక్షుడిగా రమేష్ మహరాజ్, ప్రధాన కార్యదర్శిగా స్వరాజ్ నాయక్, ఉద్యోగ సేన రాష్ట్ర ఇన్‌చార్జిగా మూడావత్ కృష్ణానాయక్, కో-కన్వీనర్లు, తదితరులను నియమించినట్లు ఆయన తెలిపారు.

కులగణనపై పటిష్ట చట్టం తీసుకురావాలి: సత్యం

బర్కత్‌పుర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పటిష్టంగా కులగణన చేపట్టడానికి ప్రభుత్వం సమగ్రమైన చట్టాన్ని తీసుకురావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమగ్రమైన చట్టం వస్తేనే బీసీల సామాజిక ఆర్థిక అంశాలపై వివరాలు తీసుకోవచ్చని ఆయన చెప్పారు. అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం చేసి సమగ్ర చట్టం తీసుకురావాలన్నారు.

సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా నరేష్ బాబు

బర్కత్‌పుర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సామాజిక, సమరసతా వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడుగా డాక్టర్ ఆకుల నరేష్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బర్కత్‌పురాలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆకుల నరేష్‌బాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సమరసతా వేదికను బలోపేతం చేయడానికి తన వంతుకృషి చేస్తానన్నారు. శ్యామ్ ప్రసాద్, అప్పల ప్రసాద్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



భోలక్‌పూర్ మసీదు వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్, ముషీరాబాద్ సీఐ నిరంజన్

భక్తి శ్రద్ధలతో బక్రీద్

జోరుగా కుర్బానీ.. సామూహిక ప్రార్థనలు



భోలక్‌పూర్ బడీ మసీదులో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ముషీరాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముషీరాబాద్ భోలక్‌పూర్‌లోని మసీదులలో తెల్లవారుజామునే సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. 400 సంవత్సరాల చరిత్రగల భోలక్‌పూర్ బడీ మసీదులో వేలది సంఖ్యలో ముస్లింలు హాజరై సామూహిక ప్రార్థనలు చేశారు. మసీదు వద్ద చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్, సీఐ నిరంజన్‌లు బందోబస్తు నిర్వహించారు. అనంతరం ముస్లింలను ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో అత్యధికంగా ముస్లింలు నివసించే భోలక్‌పూర్‌లో పండుగ వాతావరణం నెలకొంది.



బడీ మసీదు ముత్తవల్లి నజీర్ అలీని కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నగర నాయకుడు మోహినోద్దీన్



సిద్దిక్ నగర్‌లో డాక్టర్ శేఖర్‌రెడ్డిని కలిసి పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ మైనార్టీ కమిటీ సీనియర్ నాయకుడు అక్లక్ హుస్సేన్ తదితరులు



బీఆర్ఎస్ నగర నాయకుడు మహ్మద్‌గౌస్ వాహేద్ అలీ ఆధ్వర్యంలో జరిగిన బక్రీద్ వేడుకల్లో బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ తదితరులు

భారీ వర్షం

- పోటెత్తిన వరద నీరు
- జలమయమైన రోడ్లు, లోతట్టు ప్రాంతాలు
- స్టీల్ బ్రిడ్జి కింద నిలిచిన వరదనీరు
- తొలగించిన జీహెచ్ఎంసీ సిబ్బంది



ఎన్టీఆర్ స్టేడియం వద్ద స్టీల్ బ్రిడ్జి కింద వరదనీరు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్న మునిసిపల్ సిబ్బంది

కవాడిగూడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గం పలు ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమై వాహనదారులు, పాదచారులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఎన్టీఆర్ స్టేడియం, ఇందిరాపార్కు చౌరస్తా స్టీల్ బ్రిడ్జి కింద మోకాళ్లలోతు వరద నీరు ప్రవహించడంతో వాహనదారులు స్టీల్ బ్రిడ్జి కింద నిలబడి పోయారు. కవాడిగూడ, రాంనగర్, ముషీరాబాద్, వీఎస్టీచౌరస్తా, అశోక్ నగర్ చౌరస్తా, ఇందిరాపార్కు చౌరస్తా, గాంధీనగర్ బ్రిడ్జి, కల్యాణా థియేటర్ చౌరస్తా, పద్మశాలికాలనీ, ఎస్‌బీఐ కాలనీ రోడ్, గాంధీనగర్, రోడ్లపై వరద నీరు నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

దాదాపు గంటసేపు కురిసిన భారీ వర్షంతో ఎక్కడికక్కడ రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించి పోయింది.

ముఖ్యంగా ఇందిరాపార్కు, ఎన్టీఆర్ స్టేడియం, వీఎస్టీ చౌరస్తాలో స్టీల్ బ్రిడ్జి కింద నిలిచిపోయిన వరదనీటిని జీహెచ్ఎంసీ సిబ్బంది చేరుకొని వరద నీటి మ్యాన్‌హోల్, కాలువలను శుభ్రంచేసి నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు.



కవాడిగూడ గాంధీనగర్ బ్రిడ్జి వద్ద మోకాళ్లలోతు వరదనీటిలో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



వీఎస్టీ చౌరస్తాలో స్టీల్ బ్రిడ్జికింద నిలిచి పోయిన వరదనీటితో ఇబ్బందులు పడుతున్న వాహన దారులు




పోటీలలో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను ప్రదానం చేస్తున్న హిప్నో పద్మాకమలాకర్

తండ్రి కంటే మంచి స్నేహితుడు ఎవరూ లేరు

● డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్

కవాడిగూడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తండ్రిని అర్థం చేసుకుంటే అంతకంటే మంచి స్నేహితుడు ఎవరూ ఉండరని ప్రోగ్రెసివ్ సైకలాజిస్ట్ అసోసియేషన్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్ అన్నారు. రామకృష్ణ మఠంలో యోగానంద రఘుమహారాజ్, నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాలల సేవా విభాగంలో నాన్నపై డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలకు సోమవారం బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తండ్రి కోపం ఉరుములాంటిదని ప్రేమ వర్షం లాంటిదని ఆమె అన్నారు. తండ్రి అంటే కొండంత అండ అని, ఒక భరోసా, భద్రత అని ఆమె కొనియాడారు. యోగా గురువు సరోజిని రామారావు. డాక్టర్ స్వరూపరాణి, శోభారాణి, జి. కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్, దశరథ్ తదితరులు

బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

● తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్

చిక్కడపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభలో బీసీలకు స్థానిక సంస్థల్లో ఉన్న 23 శాతం రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేయాలని తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం చిక్కడపల్లిలోని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర కార్యాలయంలో వివిధ జిల్లా అధ్యక్షుల సమావేశం రాష్ట్ర బీసీ ఐక్యవేదిక కో ఆర్డినేటర్ దశరథ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ బీసీ జనగణన, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు ఇతరత్ర అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కలను కలిసి విన్నవించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు రంగు క్రాంతి, మేడవరపు రాజేష్, నిఖిల్, అఖిల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌పీఐ ఉపాధ్యక్షుడిగా గడ్డం శంకర్

బర్కత్‌పుర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గడ్డం శంకర్, గ్రేటర్ అధ్యక్షుడిగా జెఎల్ సుదేశ్‌కుమార్ నియమితులయ్యారు. సోమవారం ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌బాబు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్థాపించిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియాను తెలంగాణలో బలోపేతం చేయడానికి తమవంతు కృషి చేస్తామని వారు చెప్పారు.

ఫుట్‌పాత్‌లను మొక్కలతో నింపాలి

రాంనగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగరంలో ఆక్రమణ చెరలో నలిగిపోతున్న ఫుట్‌పాత్‌లపై రెండు వరుసలు మొక్కలు నాటి వాటిని రక్షించాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు సీ.హెచ్. రంగయ్య జీహెచ్ఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఫుట్‌పాత్ ఆక్రమణలలో పాదచారులు నడిరోడ్డుపై రాకపోకలు సాగించడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందన్నారు. సోమవారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షా కాలం నేపథ్యంలో నగరవ్యాప్తంగా వేల కిలోమీటర్లు ఉన్న ఫుట్‌పాత్‌లపై తక్షణమే మొక్కలు నాటాలని కోరారు. ఇప్పటికే ఉన్న చెట్లు అనేక సందర్భాల్లో కూలిపోతున్న నేపథ్యంలో వాటికి సమీపంలో కూడా మొక్కలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు.



సమ్మర్ క్యాంపు శిక్షణలో ప్రావీణ్యం పొందిన కరాటే విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసిన నిర్వాహకులు

షోటోకాన్ కరాటే సమ్మర్ క్యాంపు ముగింపు

చిక్కడపల్లి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రుద్రమదేవి షోటోకాన్ కరాటే సెల్ఫ్ డిఫెన్స్‌లో 45 రోజులు నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంపు సోమవారం ముగింపు వేడుక గాంధీనగర్ డివిజన్ టీఆర్‌టీ గ్రౌండ్స్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఏ. వినయ్‌కుమార్ హాజరై ఈ సమ్మర్ క్యాంపు శిక్షణలో ప్రావీణ్యం పొందిన కరాటే విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానంలో జరుగుతున్న ఎన్నో అసాంఘిక కార్యకలాపాలను మనం చూస్తున్నామని వాటిని దీటుగా ఎదుర్కొనేందుకు నేటితరం యువతకు అవసరమన్నారు. ఆడ పిల్లలకు ధైర్యసాహసాలతో పాటు ఆత్మరక్షణ చాలా అవసరం అన్నారు. అందుకు కరాటే ఎంతో దోహదపడుతుందన్నారు. రుద్రమదేవి షోటోకన్ కరాటే సెల్ఫ్ డిఫెన్స్ మాస్టర్ నారాయణ, డాక్టర్ రవి, ఎన్. లక్ష్మి, బసవరాజు, నర్సింగ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



స్ఫూర్తి పురస్కారాల ప్రదానం

గీత ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో చిక్కడపల్లిలోని త్యాగరాయగానసభలో సోమవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా, ప్రముఖ గాయని ఆమనిలు హాజరై వివిధ రంగాల్లోని రమణ, కృష్ణ ప్రసాద్, రాజన్‌లకు స్ఫూర్తి అవార్డు పురస్కారాలను ప్రదానం చేశారు.

- చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్. కృష్ణయ్య తదితరులు

చదువుతోనే బలహీన వర్గాలకు గౌరవం

ఎంపీ ఆర్. కృష్ణయ్య

రాంనగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చదువుకుంటనే ప్రత్యేకంగా బీసీ,ఎస్సీ, ఎస్టీలకు కుల గౌరవం, కుటుంబ గౌరవం పెరుగుతుందని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. సోమవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బడికి పోదాం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి బీసీ, ఎస్సీ, ఎస్టీలు తమ పిల్లలను బడికి పంపాలని కోరారు. పిల్లలు చదువుకుంటే భవిష్యత్‌లో వారు డాక్టర్స్, ఇంజనీర్స్, కలెక్టర్స్, ఆఫీసర్స్ అవుతారని గౌరవం పెరుగుతుందని ఆ కుటుంబాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకుంటే వారిలో దాగిఉన్న జ్ఞానం, ప్రతిభ బయటకు వస్తాయని, దీని మూలంగా దేశంలో ప్రగతి పథంలో నడుస్తుందని భారతదేశం అగ్రదేశంగా తయారవుతుందన్నారు. విద్యా ద్వారానే కుల నిర్మూలన జరుగుతుందని, మూఢ విశ్వాసాలు, మూఢ నమ్మకాలు తొలగిపోతాయని, అజ్ఞానం, అంధకారం, అమాయకత్వం నుంచి ప్రజలను విముక్తి చేసి ఒక విజ్ఞానవంతమైన శాస్త్రీయ జ్ఞానంతో కూడిన సమాజం నిర్మాణం చేయగలమన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు నీల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్సులో ఉచిత శిక్షణ

బర్కత్ పుర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): భాషా సాంస్కృతిక శాఖ, సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ సంయుక్త ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సినిమాటోగ్రఫీ రంగాల్లో ఆరు నెలల ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ చైర్మన్ ఏం.సి. శేఖర్ తెలిపారు. ఫొటోగ్రఫీ అభిరుచి కల్గినవారు, వృత్తిగా స్వీకరించేవారికి ప్రాథమిక ఫొటోగ్రఫీతోపాటు పిక్టోరియల్ షూటింగ్ నైపుణ్యాలను, ఆధునాతన సాంకేతికతలు, కంపొజిషన్, లైటింగ్, ఫ్రేమ్మింగ్, పోసింగ్‌లలో అనుభవం కల్గిన అధ్యాపకులచే శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. ఈ ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్స్ పట్టణగ్రామీణ యువతకు సాయం చేయడమే కాకుండా ఫొటోగ్రాఫర్‌గా ఎదిగి, వృత్తిగా స్వీకరించేవారికి ఉపాధి కూడా లభిస్తుందని వెల్లడించారు. ఉచిత ఫొటోగ్రఫీ డిప్లొమా కోర్స్ జులై 15 నుంచి ప్రారంభమౌతాయని, ఆసక్తి కల అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ లోపు ఈ క్రింది ఫోన్ నంబర్లలో 8008021075, 7095692175 సంప్రదించి తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి పోటు రంగారావు తదితరులు

రచయిత్రి అరుంధతి రాయ్‌పై ఉపా కేసులు ఎత్తివేయాలి

రాంనగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత్రి అరుంధతి రాయ్, ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్‌లపై పెట్టిన అన్ లా ఫుల్ ప్రివెంటివ్ యాక్ట్ (ఉపా) పేరుతో ప్రాసిక్యూషన్ చేయడాన్ని నిలిపివేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి పోటు రంగారావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 14 ఏళ్ల క్రితం కాశ్మీర్ సమస్యపై అరుంధతి రాయ్ మాట్లాడిన దానిని తిరగదోడి నేడు మోదీ, అమిత్‌షాల ప్రభుత్వం కేసు పేరుతో వేధించే చర్యలను మానుకోవాలని హితవు పలికారు. మోదీ ప్రభుత్వం ప్రజాస్వామికవాదులను హక్కుల కోసం ఉద్యమించే వారిపై హింసించే చర్యలను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారందరినీ సీఎం అయినా, మేధావులైనా జైలులో పెట్టి హింసించడం అప్రజాస్వామికమైనదని, దీనిని దేశ ప్రజలందరూ వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు కె. రమ, కె. సూర్యం, ఎస్. ఎల్. పద్మ తదితరులు పాల్గొన్నారు.

భర్తతో గొడవపడి వెళ్లిపోయిన భార్య

బర్కత్‌పుర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): భార్య పుట్టింటికి వెళతానంటే భర్త నిరాకరించడంతో ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ ఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కాచిగూడ చప్పల్ బజార్లో నివాసం ఉంటున్న శ్యాంసింగ్ సతీమణి నికితాసింగ్ (35) పుట్టింటికి వెళ్తానని భర్తకు చెప్పగా ఆయన నిరాకరించాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన నికితాసింగ్ ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి సోమవారం మధ్యాహ్నం వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు, బంధువులు స్నేహితుల ఇళ్లలో వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో నికిత భర్త శ్యాంసింగ్ సోమవారం రాత్రి కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు.

వేర్వేరు చోట్ల రైలు ఢీకొని ఇద్దరి మృతి

బర్కత్‌పుర, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గూడ్స్ రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. కాచిగూడ పీఎస్ పీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేటలో నివాసం ఉంటున్న ఎస్ రామకృష్ణ(33) సోమవారం మలక్‌పేట రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారం వెంట నడుచుకుంటూ వెళ్తుండగా గూడ్స్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో సంఘటనలో ఉప్పుగూడ-ఫలక్‌నామా రైల్వే స్టేషన్ల నడుమ సోమవారం ఉదయం ఏడు గంటల సమయంలో 35 ఏళ్ల వయస్సుల గుర్తుతెలియని వ్యక్తి పట్టాలుదాటుతుండగా రైలు ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ రెండు సంఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.